క్లుప్తంగా

'గురునానక్'లో రక్తదాన శిబిరం

ఇబ్రహీంపట్నం: మహావీర్ చక్ర అవార్డు గ్రహీత, కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు అర్పించిన వీర సైనికుడు మేజర్ పద్మపాణి ఆచార్య జయంతిని శుక్రవారం గురునానక్ విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గగన్ దీప్‌సింగ్ కోహ్లీతో పాటు దాదాపు 600 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా మాట్లాడుతూ.. తలసీమియా, రోడ్డు ప్రమాద బాధితులు, ఇతర వ్యాధులు, రక్తలేమితో బాధపడుతున్న రోగులకు ఈ శిబిరం ద్వారా సేకరించిన రక్త యూనిట్లను అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ ఆఫ్ ఖజకిస్థాన్ హానరరీ కౌన్సిల్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్, అపోలో హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఆశిష్ చౌహాన్, రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓకు సన్మానం



మధుసూదనాచారిని సన్మానించిన నాయకులు, అధికారులు

కడ్తాల్: కడ్తాల్ మండల ఎంపీఓ మధుసూదనాచారి.. మంచాల మండలానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, స్థానిక నాయకులు.. మధుసూదనాచారిని ఘనంగా సన్మానించారు. గత రెండేళ్లుగా మండలంలో.. పల్లెప్రగతి, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, పారిశుధ్య నిర్వాహణ మొదలైన కార్యక్రమాల్లో మధుసూదనాచారి అందించిన సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో ఆయన ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, పంచాయతీ కార్యదర్శులు శ్రీహరి, రాఘవేందర్, రాజునాయక్, హరీష్‌రెడ్డి, సత్యం, ప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, లాయక్ అలీ, నర్సింహ రాజేందర్‌గౌడ్, నరేశ్, శ్రీను చంద్రయ్య, అశోక్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

తలకొండపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి రాకముందు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా సమస్యలపై స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. దీనికి నిరసనగా ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల తలకొండపల్లి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా ప్రేమలత, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా వరలక్ష్మి,కమిటీ సభ్యులుగా.. అంజమ్మ, వసంత, భాగ్యమ్మ, పద్మ, వెంకటమ్మ, రాములమ్మ, జయమ్మ, సుశీలను ఎన్నుకున్నారు.

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి

సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్

కడ్తాల్: సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ తండాకు చెందిన జర్పుల శంకర్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ సేన సన్నాహక సమావేశంలో.. ఆ సంఘం వ్యవస్థాపక, జాతీయ అ ధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ చేతుల మీదు గా శంకర్‌నాయక్ నియామకపత్రం అందుకున్నారు. శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

మంచాల: రియల్ ఇండియా మినిస్ట్రీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆరుట్లలో ఎంపీపీఎస్ ఆరుట్ల, హరిజనవాడ ఆరుట్ల-1, 2 పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం నోటు పుస్తకాలు మరియు పెన్సిల్స్ అందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వ బడుల్లోని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రియల్ ఇండియా మినిస్ట్రీ ఫౌండర్ అండ్ డైరెక్టర్ జయకుమార్, సుజాతారాణి, సామెల్, కిషన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, జమీర్, జగదీశ్వరి ఉపాధ్యాయులు.. భాషయ్య, కృష్ణారెడ్డి, రవీందర్, రజిని, శ్రీలత పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల ప్రత్యేక యోగా శిబిరాలు నిర్వహించారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత భారతదేశానికే దక్కుతుందని యోగా మాస్టర్లు, ప్రజాప్రతినిధులు తెలిపారు. నిత్యం యోగాసనాలు వేయడం వలన ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు చేపట్టిన యోగాసనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – సాక్షి, నెట్‌వర్క్



తుర్కయంజాల్: రాగన్నగూడలో..



మంచాల: యోగాసనాలు వేసిన అధికారులు



తుర్కయంజాల్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ట్రస్మా జిల్లా కోశాధికారి మీసేందర్‌రావు



యాచారం: చింతపట్ల ఉన్నత పాఠశాలలో..



ఇబ్రహీంపట్నం: టీఆర్‌ఆర్ స్కూల్‌లో..



కడ్తాల్: మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో..



ఆమనగల్లు: యోగా దినోత్సవంలో మహిళలు



ఆమనగల్లు: శ్రీకర యోగా కేంద్రంలో..



ఇబ్రహీంపట్నం: మెగాసిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో..

ప్రజా శ్రేయస్సుకు బాధ్యతగా పనిచేశా..

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అనిత కంటతడి
- సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపిన నేత
- జూలై 4తో ముగియనున్న పాలకవర్గం పదవీకాలం



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆమనగల్లు: ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా భావించి పనిచేశానని, ఎంపీపీగా ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేశానని ఆమనగల్లు ఎంపీపీ అనిత అన్నారు. ఆమనగల్లు మండల పరిషత్.. చివరి సర్వసభ్య సమావేశం(ప్రస్తుత పాలకవర్గం)లో శుక్రవారం ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఎంపీటీసీలు మంగమ్మ, సరిత పంతునాయక్, కుమార్, కోఆప్షన్ సభ్యుడు హాజీపాషా హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సమస్యలను పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో రోడ్ల మరమ్మతులకు శంకుస్థాపన చేసినప్పటికీ.. ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని పోలెపల్లి ఎంపీటీసీ సభ్యుడు కుమార్ ఆరోపించారు. ఆమనగల్లు నుంచి జంగారెడ్డిపల్లి మీదుగా చంద్రాయణపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైందని రాకపోకలకు ఇబ్బందిగా ఉందని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆర్అండ్‌బీ ఏఈ రవితేజ సమాధానం ఇస్తూ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని, శంకుస్థాపన చేసినప్పటికీ టెండర్లకు కాంట్రాక్టర్లెవరూ ముందుకు రావడం లేదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి సూచించారు. గ్రామాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆన్-ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ కుమార్ కోరగా పరిశీలించి వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామని విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వంలో మన ఊరు మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే పూర్తిచేయాలని పలువురు సభ్యులు కోరారు. ఎంపీడీఓ కుసుమ మాధురి మాట్లాడుతూ.. గ్రామ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

ఎవరినైనా బాధపెడితే క్షమించండి..

ఎంపీపీ అనిత మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయని అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మండలంలో వివిధ అభివృద్ధి పనులు, అసంపూర్తి పనులను చేపడతామని చెప్పారు. కాగా జూలై 4న ఎంపీపీతో పాటు పాలకవర్గం పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో సమావేశంలో మాట్లాడుతుండగానే ఎంపీపీ అనిత భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. తన పదవీకాలంలో ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించాలని సభ్యులను కోరారు. తన పదవీకాలంలో ప్రతీ నిమిషం ప్రజాసేవకే కేటాయించానని అన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ రోజ, డీటీ వినోద్‌కుమార్, ఎంపీఓ శ్రీలత, ఏఓ అరుణకుమారి, ఎంఈఓ సర్దార్‌నాయక్, ఏఈలు తిరుపతయ్య, కృష్ణయ్య, శరత్, రవితేజ, సీతారాం, డాక్టర్లు విజయ్‌కుమార్, నాగార్జున, హార్టికల్చర్ అధికారి సౌమ్య, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

ఎంపీడీఓకు సన్మానం..

ఆమనగల్లు: ఆమనగల్లు నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన కుసుమ మాధురిని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు కుమార్, సరిత, హాజీపాషా సత్కరించారు. మండల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఎంపీటీసీ నిట్టె మంగమ్మలు పాల్గొన్నారు.

సమీరా చదువు బాధ్యత మాదే..

- సియా ఫౌండేషన్ చైర్మన్ అమ్జద్
- నిరుపేద విద్యార్థినికి ఆర్థికసాయం, ఇంటర్ చదివిస్తామని హామీ



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మాడ్గుల: నిరుపేద విద్యార్థినికి సియా ఫౌండేషన్ చైర్మన్ సయ్యద్ అమ్జద్ అండగా నిలిచారు. మండలానికి చెందిన ఎండీ.సమీరా ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 9.7 జీపీఏ సాధించింది. పై చదువుల కోసం ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో విషయం తెలుసుకున్న సియా ఫౌండేషన్ ఆమెకు ఆర్థికసాయం అందించేందుకు ముందుకు వచ్చింది. సమీరా ఇంటర్మీడియట్‌కు అయ్యే ఖర్చును తామే భరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే తక్షణ సహాయంగా రూ.30 అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ అమ్జద్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. సమీరా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్, మాజీ కౌన్సిలర్ మక్బూల్, ఫౌండేషన్ సభ్యులు ఇంతియాజ్ ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, శానవాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి ఆదిబట్లవాసుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని ఎస్సీ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని పుర ప్రజలు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం కోసం వచ్చిన ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసి ఈమేరకు వారు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు బర్నింగ్ ప్లాట్‌ఫాంలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, పట్టణ ప్రజలు నర్సింహ, యాదయ్య, మల్లయ్య, రాములు, ఎల్లయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ ఎస్ఐ ప్రసాద్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రసాద్

యాచారం: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పోలీస్ శాఖ కృషి చేస్తోందని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై వివరించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలపై సమాచారం అందించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జయశంకర్‌కు నివాళి

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. జయశంకర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కుమార్, సరిత, మంగమ్మ, హాజీపాషా, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, ఎంపీడీఓ మాధురి, ఎంపీఓ శ్రీలత, ఏఈ కృష్ణయ్య, నాయకులు విజయ్, పంతునాయక్, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి ఎంపీపీ కృపేశ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎండీపీఓ వెంకటమ్మ, సూపరింటెండెంట్ క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దుచేయాలి



ఆమనగల్లు: నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు రాములు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణనాయక్, ఖాదర్‌ఖాద్రీ, అబ్దుల్ ఖాదర్, కరీం, ప్రసాద్, సురేష్ నాయక్, మహేశ్, శేఖర్‌గౌడ్, మల్లయ్య, సురేశ్, వెంకటేశ్, శ్రీను, తిరుమలేశ్, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల హస్తం ఉంది..

తుర్కయంజాల్: నీట్ పేపర్ లీకేజీలో బీజేపీ నాయకుల హస్తం ఉందని.. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి.. కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాగన్నగూడలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఐద్వా రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే నీట్ పేపర్ లీక్ అయినట్లు ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ నాయకులపై ఆరోపణలు వస్తున్నా ప్రధానమంత్రి మోదీ స్పందించకపోవడం శోచనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయమ్మ, సుమలత, నాయకులు.. ఉమ, స్వప్న, అనురాధ, సంధ్య, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

అంబేడ్కర్ విగ్రహానికి బీజేవైఎం నేతల వినతి



ఆమనగల్లు: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం నాయకులు

ఆమనగల్లు: రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం విచారకరమని జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు సాయి, కల్వకుర్తి బీజేవైఎం కన్వీనర్ పద్మ అనిల్ అన్నారు. విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రవిరాథోడ్, శ్రీనివాస్, రవి, పరశురాం, గణేశ్, రాఘవేందర్, మహేశ్, సాయి, రాజు, మనోజ్, సురేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి..

ఇబ్రహీంపట్నం: విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రిని నియమించాలని బీఆర్ఎస్ నాయకులు, ఎంపీటీసీ ఏనుగు భరత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతూ.. ఆదాయ మార్గమున్న ఎక్సైజ్ శాఖకు మంత్రిని నియమించిన ముఖ్యమంత్రి భావిభారతాన్ని నిర్మించే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మంత్రిని నియమించకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులని నియంత్రించాల్సిన అవసరం ఉందని అన్నారు. జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు.

అంగన్‌వాడీల సేవలు అభినందనీయం

ఎంపీపీ కొప్పు సుకన్య



ప్రీ ప్రైమరీ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుకన్య

యాచారం: చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ ప్రైమరీ బుక్స్‌ను ఆమె పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ... అంగన్‌వాడీ స్థాయిలోనే చిన్నారులకు ఆట, పాటల ద్వారా విద్య నేర్పించడం సంతోషకరమని అన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీ ప్రైమరీపై బుక్స్ పంపిణీ చేస్తున్నాయన్నారు. అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగమ్మ, ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.



కల్యాణం.. కమనీయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని శ్రీ భవానీ నాగలింగేశ్వస్వామి కళ్యాణోత్సవాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఆలయంలో నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.